వన్యప్రాణులను హతమార్చిన ఐదుగురి అరెస్టు

అరెస్టు చూపుతున్న ఎఫ్ఆర్‌వో రవికిరణ్

ఖానాపురం, మార్చి 17 : పాకాల అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులను హతమార్చిన ఐదుగురు వేటగాళ్లపై కేసు నమోదు చేసినట్లు నర్సంపేట ఎఫ్ఆర్‌వో రవికిరణ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నర్సంపేట అటవీ కార్యాలయంలో నిందితుల వివరాలను వెల్లడించారు. చిలుకమ్మనగర్‌కు చెందిన ఇస్లావత్ సుధీర్, కుమార్, సుమన్, అశోక్‌నగర్‌కు చెందిన సురేశ్, ఏకాంబ్రం, మొండ్రాయి గూడానికి చెందిన లవకుమార్ పాకాల అభయారణ్యంలో ఉచ్చులు, విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులు కనుజు, కొండగొర్రెను హతమార్చారు. ఆదివారం ఆటోలో వాటిని నర్సంపేటకు తరలిస్తుండగా చెక్‌పోస్టు సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో కనుజు మాంసం, కొండ గొర్రెను వదిలేసి పరారయ్యారు. ఈ మేరకు పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారు. సీసీ పుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. వీరిలో అశోక్‌నగర్‌కు చెందిన ఏకాంబ్రం కాలికి గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఎంజీఎం దవాఖానకు తరలించారు. మిగిలిన ఐదుగురిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు.

గంగదేవిపల్లిని సందర్శించిన అధికారులు

అధికారులతో శిక్షణ మేనేజర్ రాజమౌళి

గీసుగొండ, మార్చి 17 : జాతీయ ఆదర్శ గ్రామ పంచాయతీ గంగదేవిపల్లిని సోమవారం కేంద్ర ప్రభుత్వ సర్వీసు అధికారులు 26 మంది శిక్షణలో భాగంగా సందర్శించారు. ఇండియా సెక్రటరీయెట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ సోని ఆధ్వర్యంలో బృందం సభ్యులు గ్రామంలో పర్యటించి, గ్రామాభివృద్ధిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐఎస్‌టీమ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, శిక్షణ మేనేజర్లు రాజమౌళి, కుమారస్వామి, రాజీవ్, సరోజన పాల్గొన్నారు.

నల్లబెల్లిలో గుప్త నిధుల కోసం తవ్వకాలు

శివాలయంలో దుండగులు తొవ్విన గొయ్యి

నల్లబెల్లి, మార్చి 17 : మండలంలో మళ్లీ గుప్త నిధుల తవ్వకాలు మొదలయ్యాయి. పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో శిథిలావస్థ దేవాలయంలోని ప్రధాన గర్భ గుడిలో గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. మండలంలోని శనిగరం శివారు అత్యంత పురాతన శివాలయం ఉంది. ఎప్పటి నుంచో గుర్తు తెలియని వ్యక్తులు ఇక్కడ గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపడుతూ ఉన్నారు. ఆదివారం రాత్రి కూడా క్షుద్రపూజలు నిర్వహించి గర్భ గుడిలో గుప్త నిధుల తవ్వకాలు చేపట్టినట్లు ఆనవాళ్లు కనిపించాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుప్తనిధుల తవ్వకాల ముఠాపై విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్లక్ష్యంగా సర్జరీ చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ చౌరస్తా, మార్చి 17 : ప్రసూతి వైద్యం కోసం వస్తే నిర్లక్ష్యంగా వ్యవహరించి మహిళ ప్రాణాలు పోయే పరిస్థితి కల్పించిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఎనుమాముల ప్రాంతానికి చెందిన ఈర్ల వెన్నెలకు మార్చి 11న సీకేఎం వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించగా మగ శిశువుకు జన్మనిచ్చింది. శస్త్రచికిత్స సమయంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆమె పొట్టలో ప్యాడ్(దూది పొరలు) మర్చిపోయి కుట్లు వేసి డిస్చార్జి చేశారు. మూడు రోజుల తర్వాత ఆమె తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమెకు తిరిగి శస్త్రచికిత్స చేసి, పొట్టలోని ప్యాడ్స్‌ను తొలగించారు. ఈ ఘటనపై ఐద్వా ప్రతినిధులు స్పందిస్తూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, మహిళల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వైద్యులపై కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి నష్టపరిహారం చెల్లించడంతో పాటుగా వైద్యఖర్చులు పూర్తిగా ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేస్తూ దవాఖాన ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిల, ఆర్ఎంవో మురళికి వినతిపత్రం అందజేశారు.

ఎంఈవోగా అనురాధ బాధ్యతల స్వీకరణ

నల్లబెల్లి, మార్చి 17 : నల్లబెల్లి ఎంఈవోగా అనురాధ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని నందిగామ జడ్పీహెచ్‌ఎస్‌లో గెజిటెడ్ హెచ్ఎంగా పనిచేస్తున్న ఆమెను నల్లబెల్లి ఎంఈవోగా నియమిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన అనురాధకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
jobs Apply Now!
★Wanted Female Marketing Executives for a Reputed Pvt. Ltd Company. Salary : 12,000/- to 20,000/-, Quli: Inter/Degree, Age: 24 to 30. Cont: 7660009009, 7036229903
NTW-332480
SHORT TERM COACHING
★Sri Chaitanya Junior College, Uppal. 45 Days BiPC-NEET and MPC-EAMCET. Contact: K. ASHOK REDDY, AO. Cell: 9441884705
NTW-000
PLOT FOR SALE
★హైదరాబాద్‌లో మరో న్యూయార్క్ లాంటి 4వ సిటీ మహేశ్వరం, ముచ్చర్ల, కందుకూరులో ప్లాట్లు, విల్లాలు & ఇండ్లు అమ్మబడును. శ్రీశైలం హైవేకి మహర్దశ... ఆలస్యం చేయకండి... నేడు తక్కువ ధరలో కొనండి - రేపు కోటీశ్వరులు కండి. మహేశ్వరంలో ఓపెన్ ప్లాట్ రూ. 6,000/-కే గజం. సంప్ర: 8008091512.
NT-330660
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- వరంగల్ ప్రజావాణికి 94 దరఖాస్తులు

కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఇన్నర్ రింగ్ రోడ్డు బాధితులు

ఖిలావరంగల్, మార్చి 17 : జిల్లాలో ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు. వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆమె వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి 94 వినతులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా 20 రెవెన్యూ శాఖకు చెందినవే కావడం గమనార్హం. ఇటీవల జిల్లాలో ఆశ కార్యకర్తల నియామకంలో జరిగిన అవతవకలపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రాయపర్తికి చెందిన మాచర్ల ప్రభాకర్ వినతి పత్రం సమర్పించారు. అలాగే, ఇళ్లతోపాటు స్థలాలను కోల్పోతున్న తమకు నష్ట పరిహారం చెల్లించాలని ఇన్నర్ రింగ్ రోడ్డు భూ బాధితులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో సుమారు 23 రైస్ మిల్లులు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమాలకు పాల్పడుతున్నాయని ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్ వినతి పత్రం సమర్పించారు. కాగా, కలెక్టర్ 94 దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపి, సమస్యలను పరిష్కరించాలని అదేశించారు. నిబంధనల మేరకు పరిష్కరించలేని దరఖాస్తులను ఆయా దరకాస్తుదారునికి స్పష్టంగా తెలియజేయాలన్నారు. అనంతరం జిల్లాలో తాగు నీటి ఎద్దడి, విద్యుత్ సరఫరా, రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్తార్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

నీటి ఎద్దడి కారణంగా ఎండిపోయిన పంటలకు నష్ట పరిహారం అందించాలని, అలాగే, దేవాదుల ద్వారా సాగునీటిని అందించాలని కోరుతూ కలెక్టర్ సత్యశారదను అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ (ఏ ఐకేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడుతూ ఖిలా వరంగల్ మండలంలో సాగు నీటి కోసం 15 ఏళ్ల క్రితం దేవాదుల ప్రాజెక్టు ద్వారా డీ-8 కాల్వను నిర్మించినా ఇప్పటి వరకు చుక్క నీరు రాలేదన్నారు. చెట్లు పెరిగి శిథిలావస్థకు చేరిన కాల్వను శుభ్రం చేసి నీరందించాలని కోరారు. జిల్లా కార్యదర్శి కే బాబురావు, నాయకులు గోనె రామచందర్, మంద రవి, నగేశ్ పాల్గొన్నారు.

20న బల్దియా ప్రత్యేక సమావేశం

వరంగల్, మార్చి 17 : బల్దియా ప్రత్యేక సమావేశాన్ని ఈ నెల 20న ఏర్పాటు చేసినట్లు బల్దియా కార్యదర్శి అలివేలు ఒక ప్రకటనలో తెలిపారు. బల్దియా కౌన్సిల్ హాల్‌లో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన ఉదయం 11.30 గంటలకు జరిగే సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలను పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

వృద్ధురాలికి చేయూత

మట్టెవాడ, మార్చి 17 : నిరాశ్రయులైన ఓ వృద్ధురాలికి రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటలో వృద్ధురాలు రాజ్యలక్ష్మి సొంత వారు లేక ఇబ్బందులు పడుతోంది. నేలపైనే పడుకుంటూ అనారోగ్యంతో బాధపడుతున్నది. ఇది గమనించిన స్థానిక రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ శ్రవణ్ సోమవారం వృద్ధురాలు నిద్రించేందుకు బల్లను అందించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

ఘటనా స్థలంలో గీతకార్మికుడు

సంగెం, మార్చి 17 : తాటిచెట్టు పైనుంచి పడిన గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని ఆశాలపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు చీకటి కొమురయ్య వృత్తిలో భాగంగా సోమవారం సాయం త్రం తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారడంతో కిందపడిపోయాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయనను ఎంజీఎం దవాఖానకు తరలించారు. గాయపడిన గీతకార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ కులస్తులు కోరారు.

రేపు రాయపర్తి అంగడి వేలం

రాయపర్తి, మార్చి 17 : మండల కేంద్రంలో నిర్వహించే సంత బహిరంగ వేలం పాటను బుధవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వల్లె వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాశ్ సమక్షంలో ఉదయం 11 గంటలకు వేలం పాట జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన కాంట్రాక్టర్లు సకాలంలో హాజరు కావాలని సూచించారు. సమావేశంలో కారోబార్ కారుపోతుల రాంచంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు బియ్యం అందజేత

నర్సంపేట, మార్చి17 : మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన కందుల ఆగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా 50 కిలోల బియ్యం అందజేశారు. గ్రామ అధ్యక్షుడు చిన్నపెల్లి నర్సింగం, మాజీ ఎంపీటీసీ బండారి శ్రీలత-రమేశ్, పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి, న్యాయవాది మోటూరి రవి, మున్నూరుకాపు సంఘం గౌరవ అధ్యక్షుడు బండారి చిన్న వెంకటేశ్వర్లు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు అల్లి రవి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పత్రి కుమారస్వామి, గుంటూర్‌పల్లి ఇన్‌చార్జి సంగెం శ్రీకాంత్, మాజీ వార్డు సభ్యులు నర్సయ్య, రాంరాజ్, రవి, అశోక్, కొమ్మాలు పాల్గొన్నారు.

తిర్మలాయపల్లిలో..

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లి గ్రామానికి చెందిన విశ్వ బ్రాహ్మణుడు అడ్డూరి భిక్షపతి ఇటీవల అనారోగ్యంతో మృతిచెంగా బాధిత కుటుంబాన్ని గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడు మేరుగు రమేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మండల మధుకర్‌గౌడ్, ప్రతినిధులు బొమ్మెర శంకరయ్యగౌడ్, తాళ్లపల్లి నారాయణగౌడ్ సోమవారం పరామర్శించారు. అలాగే, సొసైటీ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందించారు.

రైతులకు అవగాహన

కరీమాబాద్, మార్చి 17 : చెరువులో చేపల ఉత్పత్తి, యాజమాన్యంపై రైతులకు మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న చెరువులో చేపల పెంపకంలో మెళకువలను వివరించారు. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టిసారించాలి

బల్దియా గ్రీవెన్స్‌లో కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్, మార్చి 17 : గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలని గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆమె వివిధ డివిజన్‌ల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కాలనీల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలు వివరించారు. రంజాన్ పండుగ మరో పది రోజుల్లో రానున్న నేపథ్యంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులు మొదలు పెట్టలేదని, వెంటనే ఈద్గా మైదానాల్లో పిచ్చి చెట్ల తొలగింపు, మసీదులకు విద్యుత్ దీపాల అలంకరణ, పరిసరాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నాయకుడు ఎండీ నయీమొద్దీన్ వినతి పత్రం అందజేశారు. 16వ డివిజన్ పరిధి మదర్ థెరిస్సా కాలనీ వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు విన్నవించారు. అనంతరం కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ గ్రీవెన్స్ వినతుల పరిష్కారంలో జాప్యం లేకుండా వింగ్ అధికారులు శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ గ్రీవెన్స్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 46, ఇంజినీరింగ్ విభాగం 24, ప్రజారోగ్య విభాగం 4, పన్నుల విభాగం 10, తాగునీటి సరఫరా 4 కలిపి మొత్త 88 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హెచ్‌వోలు రమేశ్, లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, పన్నుల అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో లక్ష్యాలను సాధించాలి

మేయర్ గుండు సుధారాణి

మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, చిత్రంలో గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్, మార్చి 17 : ఆస్తి, నీటి పన్నుల వసూళ్లలో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి పన్నుల వసూళ్ల పురోగతిపై ఆమె సర్కిళ్ల వారీగా సమీక్ష నిర్వహించారు. 2024-25లో రూ.118.06 కోట్లు పన్నుల వసూళ్ల సేకరణ లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.60.17 కోట్లు మాత్రమే వసూలు చేసినట్లు తెలిపారు. అంకితభావంతో పన్నుల వసూళ్లపై సిబ్బంది దృష్టిపెట్టాలన్నారు. బడా బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయాలన్నారు. అలాగే, ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై జరిగిన సమీక్షలో లక్షకు పైగా దరఖాస్తులు రాగా, 14,088 మంది క్రమబద్ధీకణ కోసం ఫీజులు చెల్లించారని అధికారులు వివరించారు. మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి సూచించారు. అలాగే, రంజాన్ పండుగ ఏర్పాట్లుమొదలు పెట్టాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, రవీందర్, టాక్సేషన్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది లోపు బిల్లులు చెల్లిస్తాం

ఉగాదిలోపు కొంత మేరకు కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తామని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే హామీ ఇచ్చారు. సోమవారం కార్పొరేషన్‌లో వారిని కలిసిన కాంట్రాక్టర్లు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. దీనిపై స్పందించిన వారు బడ్జెట్ సమావేశం ముగిసిన తర్వాత చర్చిస్తామని తెలిపారు. పన్నుల వసూళ్లు జరుగుతున్న తరుణంలో జనరల్ ఫండ్ సంబంధించిన బిల్లులను ఉగాది లోపు చెల్లిస్తామని తెలిపారు.

వామ్మో.. ఎల్ ఆర్ఎస్

- రూ.175 ఫీజు స్థానంలో రూ.7లక్షలు చూపిన అధికారులు
- లబోదిబోమంటున్న బాధితులు

వరంగల్, మార్చి 17 : ఎల్ఆర్ఎస్ ఫీజులు చూస్తేనే దరఖాస్తుదారులు వణికిపోతున్నారు. బల్దియా అధికారుల తప్పిదాలు అన్నీఇన్నీ కాదు. వందలు, వేలలో రావాల్సిన ఫీజులను లక్షల్లో వేసున్నారు. హనుమకొండ విజయ్‌పాల్ కాలనీ 399,400 సర్వే నంబర్లలో గజానికి రూ. 5 చొప్పున 250 గజాల స్థలం 1981 సంవత్సరంలో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. డ్యాక్యుమెంట్ విలువ కేవలం రూ. 1250 మాత్రమే. నిబంధనల ప్రకారం డ్యాక్యుమెంట్ విలువపై 14 శాతం ఫీజు కేవలం రూ.175 మాత్రమే. అయితే బల్దియా అధికారులు మాత్రం దానిని 7 లక్షలు వేశారు. అలాగే రెగ్యులరైజేషన్ ఫీజు 250 గజాలకు రూ. రూ.25,200 వేయాలి. కానీ దానికి బదులు రూ. 41,806 వేశారు. దీనిలో 25 శాతం రాయితీ రూ. 1,85,451 మినహాయించి రూ. 5,55,354 చెల్లించాలని దరఖాస్తుదారునికి ఫీజు ఇంటిమేషన్ లెటర్ పంపించారు.

కసూర్బాలో వైద్యశిబిరం

నెక్కొండ, మార్చి 17 : పెద్దకొర్పోలు కస్తూర్బా బాలికల పాఠశాలలో సోమవారం అలంకానిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి అఖిల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. స్పెషల్ ఆఫీసర్ రజిత, సూపర్‌వైజర్ రమాదేవి, ఏఎన్ఎం కుణ, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

కొసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు

నర్సంపేట/నెక్కొండ/నల్లబెల్లి/వర్ధన్నపేట, మార్చి 17: ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. నర్సంపేటలోని పాత తహసీల్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన దీక్షలో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి కల్లెపెల్లి ప్రణయ్‌దీప్ పాల్గొని మాట్లాడారు. డీబీడీమీఎస్ ప్రజా దండోరా జాతీయ అధ్యక్షుడు అందె రవి, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దు, వీహెచ్ జిల్లా అధ్యక్షుడు బాబు రాజు, గవర్‌సింగ్ పాల్గొన్నారు. అలాగే, నెక్కొండలో చేపట్టిన దీక్షలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఈదునూరి వెంకన్న, ఉపాధ్యక్షులు చెరుకు వెంకటాద్రి, సహాయ కార్యదర్శి తడుగుల జనార్దన్,మైదుం పురుషోత్తం పాల్గొన్నారు. నల్లబెల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షను మాజీ సర్పంచ్ నానెబోయిన రాజారాం ప్రారంభించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బొట్ల ప్రతాప్, మండల అధ్యక్షుడు బొమ్మకంటి అనిల్, నాయకులు పరికి కోర్నేల్, నత్తి శ్యామ్, పోలెపాక అరుణ్, అడ్డ రాజు, బొట్ల దయాకర్, కోయ్యల సుదర్శన్, రాజయ్య పాల్గొన్నారు. వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్‌లో చేపట్టిన దీక్షలో నాయకులు ఎర్ర సంతోష్, ముత్యాల మల్లేశ్, చాడ కరుణాకర్ పాల్గొన్నారు.

13వ డివిజన్‌లో కోతుల పట్టివేత

పోచమ్మమైదాన్, మార్చి 17 : గ్రేటర్ 13వ డివిజన్ నవయుగ కాలనీ, కల్యాణ్‌నగర్, శ్రీనివాసకాలనీ, టీచర్స్ కాలనీ, గణేశ్ నగర్ కాలనీలో సంచరిస్తున్న కోతులను సోమవారం పట్టుకున్నారు. స్థానిక కార్పొరేటర్ సురేశ్‌కుమార్ జోషీ కాలనీవాసుల సమస్యను గుర్తించి కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆయా కాలనీల్లో ప్రత్యేకంగా బోనులను ఏర్పాటు చేసి 32 కోతులను బంధించారు. అనంతరం వాటిని తాడ్వాయి అటవీ ప్రాంతానికి తరలించారు.

అవసరమున్న చోట అవగాహన కరువు

ఎంజీఎం దవాఖానలో ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన టీవీ

వరంగల్ చౌరస్తా, మార్చి 17 : ఎంజీఎం హాస్పిటల్‌లో వైద్యాధికారులు ఏర్పాటు చేసిన ఆరోగ్య అవగాహన చర్యలపై రోగులు పెదవి విరుస్తున్నారు. ఇటీవల ఎంజీఎం దవాఖానకు వచ్చే రోగులు ఆరోగ్య సూత్రాలు, రోగ నివారణ చర్యలు లాంటి అవగాహన కార్యక్రమాలను వీక్షించడానికి ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్‌తో పాటు ఓపీ విభాగంలో టీవీలను ఏర్పాటు చేశారు. అయితే, క్యూలైన్‌లో నిలుచొని ఓపీ రిజిస్ట్రేషన్ చేసుకున్న సందర్భంలోగాని, నిత్యం రోగుల తాకిడి కారణంగా హడావుడిగా ఉండే ఓపీ విభాగాల్లో ఈ టీవీలు అంతగా ప్రభావం చూపడం లేదని రోగులు అభిప్రాయపడుతున్నారు. దీర్ఘకాలిక, సున్నిత ఆరోగ్య అంశాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయా విభాగాల్లో వైద్యసేవల కోసం వచ్చిన రోగులకు అవగాహన కల్పించేలా ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయ పడుతున్నారు. రోగులు, బాధితులకు అవగాహన కల్పించడానికి ఆయా విభాగాల్లో సైతం టీవీలు ఏర్పాటు చేయడంతో పాటు, సదస్సులు నిర్వహిస్తే కొంత ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికైనా ధీర్ఘకాలిక, సమస్యాత్మక, సున్నిత అవయవాలకు సంబంధించిన ఆరోగ్య సూత్రాలపై రోగులకు అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏరియా దవాఖానలో డీఎంహెచ్‌వో తనిఖీ

'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

ఫ్రీజర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

వర్ధన్నపేట, మార్చి 17 : ఏరియా దవాఖానను డీఎంహెచ్‌వో సాంబశివరావు సోమవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ దవాఖానలో తాగునీటి ఇబ్బందులపై 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో ప్రత్యేక కథనం వెలువడింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో జిల్లా అధికారులతో కలిసి దవాఖానను సందర్శించారు. మంచినీటి సమస్యపై ఆరా తీశారు. మిషన్‌భగీరథ నీటి సరఫరాలో ఇబ్బంది ఉండడంతో పాటు బోరు మరమ్మతుకు గురికావడంతో తాగునీటి సమస్య ఏర్పడిట్లు గుర్తించారు. దవాఖాన ఆవరణలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో అనిల్‌కుమార్, సూపరింటెండెంట్ రామ్మూర్తి ఉన్నారు.

జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షుడికి సన్మానం